రెవెన్యూలో కనికట్టు

- బంగారు బాతులా మారిన సీవీ విధానం
- ఈఆర్పీ నుంచి ఇందులో పన్ను విధించినందుకు భారీగా ముడుపులు
- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- పర్యవేక్షణ లేమితో అంతా ఇష్టారాజ్యం
- పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మరిన్ని అంశాలు వెలుగులోకి..



నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని రెవెన్యూ విభాగం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఈ విభాగంలోని కొందరు అధికారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తూ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఉన్నది లేనట్లుగా.. లేనిది ఉన్నట్టుగా సృష్టిస్తూ వీరు కనికట్టు చేస్తున్నారు. భవనం ఉన్న ప్రదేశాన్ని ఖాళీ స్థలంగా చూపించి వీఎల్టీ విధించడం.. ఖాళీ స్థలంలో భవనం ఉందంటూ ఆస్తి పన్ను విధించడంలో వీరు దిట్ట. ఇలాంటి మాయాజాలాలతో రెవెన్యూ అధికారులు భారీగా గడిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో ఇదీ పరిస్థితి..

నెల్లూరు నగరపాలక సంస్థలో మొత్తం 1,33,552 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో ప్రైవేట్ భవనాలు 1,33,116.. రాష్ట్ర ప్రభుత్వ భవనాలు 400.. కేంద్ర ప్రభుత్వ భవనాలు 36 ఉన్నాయి. వీటి ద్వారా ఆస్తి పన్నుల రూపంలో రూ.112.44 కోట్లు.. 6567 ఖాళీ స్థలాల ద్వారా వీఎల్టీ రూపంలో రూ.17.76 కోట్ల ఆదాయం కార్పొరేషన్‌కు రావాల్సి ఉంది.

జరుగుతోందిలా..

నగరపాలక సంస్థ పరిధిలోని భవనాలకు పన్నుల విధింపు ప్రక్రియను క్యాపిటల్ వాల్యూ సిస్టమ్ (సీవీ) ద్వారా నిర్వహిస్తున్నారు. గతంలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఈఆర్పీ) పద్ధతిలో.. అంటే భవనాన్ని చదరపు మీటర్ల ద్వారా కొలతలు వేసి ఆ మేరకు పన్ను విధించేవారు. అయితే 2022 నుంచి సీవీ విధానం అమల్లోకి వచ్చింది. ఈ ప్రక్రియలో చదరపు అడుగుల ద్వారా కొలతలేసి ప్రభుత్వ మార్కెట్ వాల్యూ మేరకు స్థలం, నిర్మాణానికి సంబంధించి పన్ను విధిస్తున్నారు. ఈ సీవీ విధానం ప్రస్తుతం రెవెన్యూ అధికారులకు బంగారు బాతులా మారింది. వాస్తవానికి ఒకసారి భవనానికి పన్ను విధిస్తే, దాన్ని తగ్గించే అవకాశం ఉండదు.

కార్పొరేషన్ పరిధిలో పరిస్థితి ఏమిటో..?

వాస్తవానికి ఒకసారి పన్ను విధిస్తే ఆ మేరకే కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే పినాకినీ అవెన్యూ ప్రాంతంలోని భవనానికి సంబంధించిన పన్ను అంశాన్ని పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతోంది. ఈ ఒక్క భవన విషయంలోనే రెవెన్యూ అధికారులు ఇలా వ్యవహరిస్తే, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పరిస్థితి ఏమిటనే అనుమానం తలెత్తక మానదు. దీనిపై కలెక్టర్, కమిషనర్, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇదీ ఉదాహరణ..

నగరంలోని అపోలో హాస్పిటల్ సమీపంలో పినాకినీ అవెన్యూ ప్రాంతం ఉంది. ఇందులో ఓ భవనం (అసెస్‌మెంట్ నంబర్ 1031119419)కు 2020 – 21లో రెవెన్యూ అధికారులు ఈఆర్పీ విధానం ద్వారా కొలతలేసి రూ.1,49,173 పన్ను విధించారు. దీని ప్రకారం ఆర్నెల్లకోసారి పన్నును సదరు భవన యజమాని చెల్లించాల్సి ఉంది. అయితే సీవీ విధానం ద్వారా ఇదే భవనానికి పది రోజుల క్రితం తాజాగా రూ.49,173 పన్నును విధించారు. ఫలితంగా సదరు భవన యజమానికి ఏటా రూ.రెండు లక్షలు మిగిలిపోతుంది. ఈ ఉదంతంలో సదరు భవన యజమాని నుంచి రూ.ఐదు లక్షల వరకు పుచ్చుకున్నారని సమాచారం.

పరిశీలించి చర్యలు చేపడతాం

పన్ను వసూళ్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారని తెలిస్తే అలాంటి వారిపై చర్యలు చేపడతాం. ఒకసారి పన్ను విధిస్తే దాన్ని మార్చేందుకు అవకాశం ఉండదు. ఇలా ఎవరైనా చేశారని తేలితే చర్యలు తప్పవు.

– సూర్యతేజ, కమిషనర్

క్లుప్తంగా

కల్వర్టుల నిర్మాణంపై తహసీల్దార్ విచారణ

- ఇరువర్గాల వాగ్వాదం

పొదలకూరు : పట్టణానికి సమీపంలో ఉన్న లే–అవుట్ల నిర్మాణ వివాదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానానికి సమీపంలో పాట్లేళ్ల వాగుపై దశాబ్దం క్రితం నిర్మించిన కల్వర్టులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందడంతో తహసీల్దార్ ఎం.సారంగపాణి ఆదివారం విచారణ చేపట్టారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన వెంకటరత్నం అనే ఉపాధ్యాయుడు కల్వర్టులను అక్రమంగా నిర్మించారని, లేఅవుట్ల ఆక్రమణలో అవి ఉన్నట్లు పలు దఫాలు కలెక్టర్, తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే దేవస్థానం పాలకమండలి, స్థానికులు తహసీల్దార్ చేపట్టిన విచారణకు హాజరై కల్వర్టుల వల్ల ఎవరికీ ఎలాంటి నష్టం లేదని, పైపెచ్చు అన్ని ప్రాంతాల వారికి ఇక్కడి రోడ్లు ఉపయోగపడుతున్నాయని వెల్లడించారు. వాగుపై కల్వర్టుల నిర్మాణం మంచి పరిణామమేనని, రాకపోకలకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో కొంత వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్షేత్రస్థాయిలోని పరిణామాలను ఉన్నత స్థాయి అధికారులకు వివరిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. కాగా భాస్కర్‌నాయుడు వేసిన లేఅవుట్లో ప్రజాప్రయోజనాలకు వదిలిన స్థలం అమ్ముకున్నారని, పట్టాలేని స్థలాన్ని రిజిస్ట్రేషన్లు చేశారని, వాగు పొరంబోకు స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదులు అందాయి. దీనిపై సంబంధిత శాఖ అధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. ఈ క్రమంలో తిరిగి ప్రజల రాకపోకలకు ఉపయోపడే కల్వర్టులపై ఫిర్యాదు చేయడంతో స్థానికులు విచారణకు హాజరై వాగ్వాదానికి దిగి అందరికి ఉపయోగపడే కల్వర్టులను తొలగిస్తే సమ్మతించమని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో మనుబోలమ్మ

మనుబోలు : మనుబోలు గ్రామదేవతలైన మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు సాయిశర్మ వేదమంత్రోచ్చారణల మధ్య గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకుని సలిపిండి, పానకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.

సేవకుడిగా పనిచేస్తా

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : ఓడినా.. గెలిచినా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిరదవోలు పంచాయతీ ముత్యాలపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు, పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ కండే రమణయ్య కుమారుడి వివాహానికి కాకాణి ఆదివారం హాజరయ్యారు. పంచాయతీకి చెందిన కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతి అన్యాయంపై గళం విప్పడంతో పాటు ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు ఉద్యమిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుందన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాకాణి వెంట బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, ఇంద్రసేన్‌గౌడ్, బడుగు శ్రీహరి, వి.కృష్ణారెడ్డి, ఆకుల గంగిరెడ్డి, బడుగు శ్రీనివాసులుగౌడ్, కేతబోయిన వెంకట్రావ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

మనుబోలు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆటోవాలాలు ఇష్టానుసారం ప్రయాణికులను తరలిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట, బండేపల్లి, గురివిందపూడి, కొమ్మలపూడి, కొండూరుసత్రం, కాగితాలపూరు, పిడూరు, బద్దెవోలు తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది వివిధ పనుల నిమిత్తం నిత్యం గూడూరు, నెల్లూరుకు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ఆర్టీసీ బస్సులు ఎక్కువగా లేకపోవడంతో పాటు ఉన్న బస్సులు కూడా సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ఆటోవాలాలు అత్యాశతో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఘనంగా స్పోర్ట్స్ మీట్



బహుమతులను అందుకున్న విజేతలు

నెల్లూరు (టౌన్): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల స్పోర్ట్స్ మీట్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ రేస్ తదితర పోటీలను జరిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జూడాల భారీ ర్యాలీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ నగరంలో భారీ ర్యాలీని జూనియర్ డాక్టర్లు ఆదివారం నిర్వహించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణ నుంచి ఆర్టీసీ బస్టాండ్.. తిరిగి ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్ మస్తాన్‌బాషా మాట్లాడారు. దోషులను శిక్షించేంత వరకు నిరసనలు, ఆందోళనలకు పూర్తి మద్దతిస్తామని తెలిపారు.

నేత్రపర్వంగా గోపురోత్సవం



నెల్లూరు(బృందావనం): పవిత్రోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో పూజలు, నిత్యహోమాలు, గోపురోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉభయదేవేరులతో కొలువైన రంగనాథుడ్ని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి బంగారు బొట్టు బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి 24.6 గ్రాముల బంగారు బొట్టు.. 853 గ్రాములు కలిగిన రెండు వెండి నవావరణ హారతులను నగరానికి చెందిన మధుశేఖర్ ఆదివారం బహూకరించారు. సుమారు రూ.2.4 లక్షల విలువగల వీటిని ఆలయంలో ఈఓ వెంకటసుబ్బయ్యకు అందజేశారు. దేవస్థాన వంశ పారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



నెల్లూరు(క్రైమ్): ప్రభుత్వ అనుమతుల్లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా హెచ్చరించారు. భగత్‌సింగ్ కాలనీ సమీపంలోని రీచ్ నుంచి ఇసుక అక్రమంగా రవాణా అవుతోందని ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

పాఠశాలకు దూరంగా బాల్యం

- విద్యాశాఖకు కలగని కనువిప్పు



తోటపల్లిగూడూరు – నరుకూరు మధ్య కాగితాలు ఏరుకుంటున్న చిన్నారులు

తోటపల్లిగూడూరు : బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి.. అంటూ విద్యాశాఖ అనేక కార్యక్రమాలు జరపడమే తప్ప క్షేత్రస్థాయిలో వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించిన దాఖలాలు కానరావడం లేదు. ఎందరో బడిఈడు చిన్నారులు బడి బయట ఉంటున్నా విద్యాశాఖాధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాఠశాల పునఃప్రారంభంలో విద్యాశాఖ నెల రోజుల పాటు 'నేను బడికి పోతా' అంటూ బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఆచరణలో వీరు సాధించిన విజయం ఏమీ లేదు. అనేక మంది చిన్నారులు తోటపల్లిగూడూరు–నరుకూరు గ్రామాల మధ్య చిత్తు కాగితాలను ఏరుకుంటూ కన్పిస్తున్నారు. తమను ఎవరూ బడికి పిలవలేదంటూ కొందరూ సంచార జాతుల పిల్లలు బడికి దూరంగా బాల కార్మికులుగా మగ్గుతున్నారు. మండలంలో అనేక ప్రాంతాల్లో ఈ తంతు కనిపిస్తున్నా, విద్యాశాఖాధికారుల్లో కనువిప్పు కలగడం లేదు.

అర్జీలను నేడు సమర్పించొచ్చు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలను అందజేయొచ్చని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో గల సమావేశ మందిరంలో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు అర్జీలను అందజేయొచ్చని చెప్పారు.

రేపటి ధర్నా జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల సమస్యల పరిష్కారానికి గానూ ఏఐటీయూసీ పిలుపు మేరకు తిరుపతిలోని సీఎండీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘ ప్రధాన కార్యదర్శి హజరత్‌వలీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

హిందూ ధర్మం మన జీవన విధానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : హిందూ ధర్మం మన జీవన విధానమని త్రైత సిద్ధాంత ప్రచారకర్తలు అన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రచారకర్తలు హిందూధర్మం విశిష్టత, ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించారు. ప్రతి వీధిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత చదివి ఆచరించడం వల్ల జీవితంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు సురమౌళి, శేషరత్నమ్మ, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

సీఐను కలిసిన నేతలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వేణును అంబేడ్కర్ సేన జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. రఘు, రవియాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాలభవన్‌లో అన్నదానం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి బాలభవన్‌లో అన్నదానాన్ని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు మాట్లాడారు. జొన్నలగడ్డ మహేష్ కుమారుడు మివాన్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఆయుర్వేద వైద్యుడు శ్యామ్‌ధన్, స్వప్న, శాన్వి, ప్రవీణ్‌కుమార్, తమ్మినేని పాండు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పురస్కారాల ప్రదానం



ఇందుకూరుపేట : సరస్వతీ కళాపీఠం ఆధ్వర్యంలో పద్య, వచన కవిత పోటీల్లో విజేతలకు, పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పేరిశెట్ల పురస్కార ప్రదానోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. పేరిశెట్ల శివకుమార్, అరుణకుమారి షష్టిపూర్తి సందర్భంగా ఇందుకూరుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో కవులు, పండితులు తమ కవితలతో సాహితీ ప్రియులను అలరించారు. 'మేధావులంతా పిచ్చోళ్లే' అనే అంశంపై వచన కవితలు, 'నడుస్తున్న అమరావతి' అనే అంశంపై పద్య కవితల పోటీలు నిర్వహించి విజేతలకు పురస్కారాలను అందజేశారు. పద్య కవితల్లో ప్రథమ బహుమతి అమ్మళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్ (అనంతపురం), ద్వితీయ బహుమతి సీహెచ్‌వీ బృందవనరావు(నెల్లూరు), తృతీయ బహుమతి బీహెచ్‌వీ రమాదేవి(రాజమండ్రి) అందుకున్నారు. అలాగే చయనం అరుణాశర్మ (బెంగళూరు), ఇంద్రగంటి మధుసూదన్‌రావు(నెల్లూరు) ప్రోత్సాహక బహుమతులు పొందారు. అలాగే వచన కవితల్లో ప్రథమ బహుమతి తన్నీరు శశికళ(నాయుడుపేట), ద్వితీయ బహుమతి ఉత్పలిని(విజయనగరం), తృతీయ బహుమతి పొత్తూరు సీతారామరాజు(కాకినాడ)కు అందజేశారు. డాక్టర్ సూరం శ్రీనివాసులు, డాక్టర్ రాధేయ(అనంతపురం), డాక్టర్ మన్నెం సతీష్, ఎ.జయప్రకాష్, గోవిందరాజులు సుభద్రాదేవి, సజ్జా వెంకటేశ్వర్లు, సజ్జా వెంకటసురేష్, ఈతకోట సుబ్బారావు, అవ్వారు శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సరస్వతీ పుత్రులకు బహుమతులు

గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్వస్వతీ పుత్ర కళాపీఠం నిర్వాహకుడు పేరిశెట్ల శివకుమార్ మాట్లాడుతూ తన తండ్రి పేరిశెట్ల రామయ్య జ్ఞాపకార్థం గత 22 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని వివరించారు.

పడకేసిన పారిశుద్ధ్యం



హరనాథపురంలోని మొదటి వీధిలో వ్యర్థ నీరు



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు



అస్తవ్యస్తంగా కాలువ

- కాలువల్లో కదలని మురుగు
- పేరుకుపోతున్న చెత్త
- దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరంలో పారిశుధ్య విభాగాధికారుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరింది. పలు ప్రాంతాల్లోని చిన్న కాలువలను సైతం శుభ్రం చేసిన దాఖలాల్లేవు. ఫలితంగా కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు ముందుకు కదలడంలేదు.

కాలువలా.. అంటే..!

నగరంలోని 18వ డివిజన్ హరనాథపురంలో ఏ వీధిలో చూసినా కాలువలు కనిపించవు. ఆ ప్రాంతంలో భవన నిర్మాణాల సమయంలో కాలువలపై ర్యాంపులు, మెట్లను ఏర్పాటు చేయడంతో ఇవి మూసుకుపోయాయి. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు ముందుకు కదలడంలేదు. ఫలితంగా మురుగు రోడ్లపైనే ప్రవహిస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.

బాబోయ్.. దుర్గంధం

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ కేంద్ర కార్యాలయం హరనాథపురం మొదటి వీధిలో ఉంది. అయినా ఈ వీధిలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. నెలల తరబడి కాలువల్లో మురుగు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ప్రగల్భాలు.. కార్యాచరణ శూన్యం

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం.. దీనికి అవసరమైన చర్యలు చేపడతామంటూ తరచూ ప్రగల్భాలు పలుకుతున్నా.. క్షేత్రస్థాయిలో కార్యాచరణ శూన్యంగా ఉంటోంది. మంత్రి నారాయణ ఇలాకాలోనే పారిశుధ్యం ఇంత అధ్వానంగా ఉంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.